# మంగళ సూత్రాలు

**రైటరు చెప్పిన కథ**

రామాచారి చెయ్యి తిరిగిన పనివాడు. బంగారు పని చెయ్యడంలో అతన్ని మించిన వాడెవడూ ఆ జిల్లాలోనే లేడని పేరొందాడు.

ముఖ్యంగా ఆడపెళ్ళివారైనా మగపెళ్లివారైనా అతను మంగళసూత్రం చేస్తే మంగళప్రదమని భావించేవారు.

ఏభై ఏళ్ళుగా కొనసాగుతున్న రామాచారి వృత్తి అర్థాంతరంగా ఆగిపోయింది!! ఎందుకు?

అదో విచిత్రమైన కథ..!!

ఆ కథ చెప్పడానికి మనసు రావట్లేదు. కానీ కన్నీళ్ళు పెట్టుకుంటూ శెట్టిగారు చెప్పిన కథ విని తడిసిపోయిన గుండెతో ఈ కథ మీకు చెప్తున్నాను.

**శెట్టిగారు చెప్పిన కథ**

రామాచారి మా కుటుంబానికి బంగారు నగలు చేయడానికి తరతరాలుగా ఉన్న పరంపరలోని వాడు.

మనిషి బంగారంలో పుట్టి, బంగారుపనిలో పెరిగి, ఆ బంగారాన్ని ఒంట్లోనూ, మనస్సులోనూ నింపుకున్నాడు.

అతని వేళ్ళలో ఏమి అద్భుతం ఉందోగానీ అతను చేసే నగలు బంగారంకన్నా మిలమిలలాడుతాయి.

ముఖ్యంగా రామాచారి మంగళసూత్రాలు చేస్తే అదో అద్భుతం!

మంగళసూత్రాలు చేస్తున్నంతసేపూ అతను సూత్రాలు గట్టిగా, పటిష్టంగా నిండు నూరేళ్ళూ మెరుస్తూండాలని మెరుగులు పెడ్తాడు.

అతనికొక్కటే బాధ, బంగారంలో రాగి కలిస్తేగానీ అందమైన ఆకారం ఏర్పడదని, కానీ దాంపత్యంలో రాగి కలవకూడదని ఆలుమగలు బంగారం లాగే ఉండాలని ఆయన తపన!

అందుకే కలిపే రాగిని మంత్రించి, బంగారంలా చేస్తాడు.

మంగళసూత్రాలు చేస్తున్నప్పుడల్లా ఈ వస్తువు నూరేళ్ళపాటు కరిగించకుండా చూడు దేవుడా... అని గొట్టంతో ఊపిరిపోస్తాడు. సుత్తితో తాళమేస్తాడు.

ఆదిదంపతుల్ని మనస్సులో స్మరించుకుని– వారి ఆకృతుల్ని సూత్రపు బిళ్ళపై మంగళకరంగా చిత్రించి, ఇంకెవ్వరూ కల్పించలేనంత పవిత్రతని ఆపాదిస్తాడు.

అందుకే మా నాన్న నా పెళ్ళి సూత్రాలు ఇతనితోనే చేయించాడు. అప్పటికతని వయస్సు బహుశా నా వయస్సే ఉండొచ్చు.

ఇప్పుడు మా మనవరాలు పెళ్ళి. నా ముచ్చట ఏంటంటే రెండు మంగళసూత్రాలూ నేనే చేయిద్దామని, మగపెళ్లివారితో కరాఖండిగా చెప్పేశా, రెండు మంగలసూత్రాల ఖర్చులూ నావేనని!

పెద్దవాణ్ని గదా.. ఒప్పుకున్నారు రెండువైపులవారూ.

“మా మనవరాలి పెళ్ళయ్యా! వచ్చే నెల పద్దెనిమిదో తారీఖు ముహూర్తం. నువ్వే రెండు కుటుంబాల మంగళసూత్రాలు చేయాలి. నేనే కానుక ఇద్దామని నిశ్చయం చేసుకున్నా”

“చాలా సంతోషం శెట్టిగారూ! ఈసారి శివపార్వతుల బొమ్మేసి మంగళసూత్రాలు తయారు చేస్తాను. ఆదిదంపతుల్లా ఆ దంపతులు

పదికాలాలపాటు చల్లగా కలిసుంటారు"

"నీ హస్తవాసి గొప్పదే! నీ మాట తీరూ గొప్పదే!" అని నేను పని పురమాయించి, బయల్దేరబోతుండగా.

"తాతయ్యా! కాఫీ" అంటూ రెండు గ్లాసుల్తో కాఫీ తెచ్చి మా ఇద్దరికీ ఇచ్చింది. ఆమె రామాచారి మనవరాలు రజని!

పిల్ల బంగారు బొమ్మలా ఉంది.

క్షణం సేపు ఈర్ష్యపడ్డాను. నా మనవరాలు ఇంత బావుంటే ఎంత బావుండును- అనుకున్నా. బంగారం చేసే వాళ్ళింట్లో బంగారంలాంటి పిల్లలే పుడతారని నేను విన్నమాట జ్ఞాపకం వచ్చింది.

**మళ్ళీ రైటరు మాట**

మంగళసూత్రాలు కంసాలి దగ్గర్నుంచీ తీసుకెళ్ళడం ఓ అందమైన వేడుక.

దుప్పటిని నలుగురూ నాల్గు వైపులా పట్టుకుని ఒకళ్ళు మధ్యలో కర్రనెత్తి గొడుగులా పట్టుకుంటారు.

మంగళసూత్రాలు చేసిన కంసాలికి కొత్త బట్టలు పెట్టి ఆరోజు గ్రాసానికి స్వయంపాకమిచ్చి, అతను చేసిన మంగళసూత్రాల్ని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువెళ్తారు.

ఇపుడంటే ఎర్రకాగితంలో చుట్టిన మంగళసూత్రాన్ని ప్లాస్టిక్ డబ్బాలో పెట్టిస్తే హ్యాండుబ్యాగులోనో, జేబులోనో పెట్టి తెచ్చేస్తున్నారుగానీ...

అప్పటి రోజుల్లో అదో సంబరం! పవిత్ర బంధానికి ప్రధాన బంధమైన ఈ మంగళసూత్రాలు ముత్తయిదువతనానికి ప్రతీకగా భావిస్తారు.

ఈరోజు కట్టిన మాంగల్యం జీవితాంతం మెళ్ళో ఉండాలని గుండెకి మంగళసూత్రాలను హత్తుకుంటూ మనస్ఫూర్తిగా తలదించుకుని ప్రార్థిస్తూ

మూడుముళ్ళూ వేయించుకుంటుంది పెళ్ళికూతురు.

ఆడపిల్ల నూరేళ్లపాటు ఉంచుకోవాలనే మాంగల్యాన్ని అంత శ్రద్ధాసక్తులతోనూ తయారు చేస్తాడు రామాచారి.

కానీ రామాచారి మనవరాలికి చేసిన మంగళసూత్రం మాత్రం అచ్చిరాలేదు.

రామాచారికి, అతని పనికీ పిడుగుపాటు ఈ కథలోని అసలు కథ.

మనవరాలి పెళ్ళికి సీతారాముల బొమ్మలతో మంగళసూత్రాలు చేశాడు. రామాలయానికెళ్ళి సీతారాముల ముందుపెట్టి, అక్కణ్ణుంచి ఊరేగింపుగా తీసుకొస్తున్నాడు.

కాసేపట్లో ఎదురు సన్నాహాలు!

పెళ్ళికొడుకొస్తాడని ఎదురుచూపులు...!

పెళ్ళి హడావుడిలో ఉన్న రామాచారికి పిడుగులాంటి వార్త అందింది.

తాళి కట్టకుండానే ఆ వరుడు అవతారం పూర్తి చేసుకున్నాడు.

ఆ అమ్మాయి ఆ తర్వాత ఎవర్నీ చూడ్డానికొప్పుకోలేదు.

ఆ మంగళసూత్రాలు రామాచారి ఎవ్వరికీ అమ్మనూ లేదు.

ఆవేళ్టినుంచి పుణ్యపునీతగానే మిగిలిపోయింది గానీ పునీస్త్రీగా రామాచారి మనవరాలు ముద్రవేయించుకోలేదు.

కానీ రామాచారి మాత్రం ఆవేళ్టినుంచీ ఎప్పుడూ మంగళసూత్రాలు తయారు చేయలేదు.

ఇప్పటికీ రామాచారి దగ్గరికి ఎవరైనా వెడితే మట్టెలూ-మంగళ సూత్రాలు చేయనని చెబుతాడు.

